# రాధా మనోహరం

వేలమూరి ప్రసాదరావు



"అన్నిటా వ్యాపించి ఉండే ఆకాశం అందు కుందా మంటే అందనంత దూరంలో ఉన్నప్పుడు నీలంగా కనబడుతుంది. నా కృష్ణయ్యా అంతే. అందినట్లే ఉంటాడు. అందడు. అందుకే తానూ నీలమేఘశ్యాము డయ్యాడేమో!" అస్తమిస్తున్న సూర్యుణ్ణి, ఉదయిస్తున్న చంద్రుణ్ణి ఒక్కమారే నీలాకాశంలో చూస్తూ అనుకొన్నది రాధ. రెండు గోళాలూ కృష్ణయ్య రెండు కళ్ళల్లే అందంగా ఉన్నాయే!

"ఆకాశం, గగనం శూన్యం" అంటారు. అలాగే నిర్గుణ పరబ్రహ్మమైన కృష్ణుడు కూడా శూన్యమేనా ఏమిటి?" ఉలిక్కిపడిన రాధ వెంటనే 'అయ్యో! ఎంత అపచారం చేస్తున్నాను! ఈ భావమే నా మనస్సులో మెదలకూడదే! నా కృష్ణయ్య శూన్యం కాదు. సర్వవ్యాపి అని తెలుసుకోలేక పోతున్నాను. తెలుసుకున్న వాళ్ళ కంతటా ఉన్నాడు.

దగ్గరకు చేరేటప్పటికి మాయమవుతావు? యమునలో కన్పించిన నీ నీలిమ దోసిట నీళ్ళలో కన్పించక ఏమైపోయింది? అసలు యమునానది నలుపా, తెలుపా? నువ్వు నిజంగా ఉన్నావా?"

మనస్సును ఒక్కమాటు అదుపులోకి తెచ్చుకున్నది రాధాదేవి. ఏమిటీ వికృతపు టాలోచనలు? ఏమవుతున్నది నాకు? ఓ యమునా! ఏం చేస్తున్నావు నన్ను? నువ్వు యమునవా? విరజవా? విరజ ... విరజ... విరజ ... అబ్బ! అదొక పీడ కల. రాధ మనస్సు గతంలోకి చొచ్చుకొనిపోయింది.

•     •     •     •

ఎన్నేళ్ళ క్రితం తను కృష్ణయ్యను చూసింది మొదట? ఏమో! ఎవరికి తెలుసు? పోనీ సూర్య చంద్రులకు తెలుసేమో అడుగుదామనుకుంటే వారే పుట్టలేదయ్యె అప్పటికి. బ్రహ్మ నడుగు

నారదులతో చెప్పిన వృత్తాంతం మనస్సులో మెదిలింది.

కృష్ణ పరబ్రహ్మ విలాస క్రీడకై సంకల్పించగానే ఆయన వామభాగం నుంచి పరాశక్తిగా తాను పుట్టి అర్ఘ్య పాద్యాదులకోసం పరుగెత్తింది(ధావనం). కనుక తనకు 'రాధా' అనే పేరు వచ్చిం దన్నాడు కృష్ణయ్య. చమత్కారి. మాటలతో మాయచేద్దామని చూస్తాడు. కాని మాటలతో ప్రయోజన మేమిటి?

అయితే ఆయన శిష్యులు మరీను. మరీ ఆ అష్టాదశ పురాణాలు వ్రాసిన వ్యాసుడైతే ఇక చెప్పనే అక్కర్లేదు. ఆయన మాటలు వింటే, ఇక తాను కోరుకోవలసినదే లేదు. ఆ బ్రహ్మ అంతే. ఇక తక్కిన వైష్ణవుల మాట చెప్పేది కేముంది?

నిరంతరమూ కృష్ణుడు ధారాపాతంగా ఆనంద రసాన్ని ప్రసాదిస్తూ ఉండటం వల్ల రాధ అనే పేరు

'యమునా తరంగాలపై తేలియాడుతూ ఇంత వరకూ మధుర పరిమళాలతో పైకశాల నిండా మత్తు నింపిన పద్మాలు ముకుళించి, కలువలు వికసిస్తున్నాయి. నా స్వామిని చూడలేక నా మనస్సు లాగే ఈ పద్మాలు ముడుచుకుంటున్నాయి' అనుకున్నది రాధ. 'నా మనస్సులో కృష్ణదర్శన లాలసతో వికసిస్తున్న కోరికల లాగే విచ్చుకుంటున్నాయి ఈ కలువలు!' ప్రకృతిలో ప్రతి వస్తువూ కృష్ణమయమే రాధకు.

నీలిమ—నీలిమ—కాళిందీ జలాలలో నీలిమ—యమునలోకి వంగి దోసెడు నీళ్ళు తీసుకుని పరిశీలనగా చూసింది రాధ. నీళ్ళు నల్లగా లేవు. తెల్లగానే ఉన్నాయి. ఆశ్చర్యం! ప్రవహిస్తున్న యమునా నదిలోకి చూసింది. ప్రవాహం నల్లగానే ఉన్నది. దోసిట్లో నీళ్ళు చూసింది. తెల్లగానే ఉన్నాయి. 'అయ్యో!' అని నిట్టూర్పు విడిచింది రాధ.

"కృష్ణా! ఎందు కలా దూరాన్నుంచి పూరించి,

దామా అంటే అప్పటి కింకా సత్యలోకమే ప్రకాశించ లేదే.

పోనీలే, ఎప్పుడో ఒకప్పుడు—తన తల్లితండ్రు లెవరు? తన బాల్యం ఎక్కడ, ఎలా గడిచింది?


అవేవీ గుర్తు రాలేదు రాధకు. తనకు తల్లి, తండ్రీ లేరు. కేవలం ప్రియుడుమాత్రమే ఉన్నాడు. ఆ ప్రియుడే కృష్ణుడు. ఆయన సృష్టే తాను. తను పుట్టటమే యవ్వనవతిగా పుట్టింది. తనకు బాల్యమూ లేదు, వార్ధక్యమూ లేదు. తన కృష్ణయ్య లాగే తనకూ నిత్య యవ్వనమే.

తన కృష్ణయ్యను చూసిన మొదటి క్షణంలో తనకు ఒక విచిత్రమైన కోరిక కలిగింది. పుడుతూనే జగన్మోహన కరమైన కృష్ణయ్య ముద్దు పాదాలు చూసింది తాను. వెంటనే ఆ పాదాలను కడిగి, నీళ్ళు నెత్తిన చల్లుకోవాలని నీళ్ళకోసం పరుగెత్తింది. అప్పటి నుంచి తనకు 'రాధ' అనే పేరు స్థిరపడి పోయింది. తన నల్లనయ్య తన పుట్టుక సంగతి

సూచిస్తున్నడట. ఆహా! ఎంత ఆనందంగా ఉన్నానో! నా స్వామిని వదలిపెట్టిన నా కిక ఆనందమెక్కడిది? కాని ఈ విరహం బ్రహ్మాది శాస్త్రకారులకూ, సూత్రకారులకూ ఏం అర్థ మవుతుంది?

నేను శ్రీకృష్ణ మాధుర్యాన్ని ఎలా అనుభవిస్తున్నానో, అలా తాను కూడా శ్రీ కృష్ణామృతానుభవాన్ని పొందాలనే వాంఛ మా కృష్ణయ్యకు కల్గిందట. అయితే తాను కృష్ణుడుగా ఉంటే ఆ అనుభవం అసాధ్యం గనుక తాను రాధా తత్త్వాన్ని పొందాలి. మరి తాను రాధగా మారితే కృష్ణుడేడీ? అందువల్ల రాధాకృష్ణైక సమరస స్వరూపాన్ని కృష్ణయ్య ధరించాడని ఒక కథ. కథలకేం బాగానే ఉంటాయి. బాధపడేవాళ్ళకేగా ఆ కష్టం తెలిసేది?

ఋషులకూ, కవులకూ తగిన పని లేదు. తాను శ్రీకృష్ణుడి అంతరంగ ఆనందమయమైన హ్లాదినీ శక్తట! ఓహో! ఏం హ్లాదమయ్యా! ఎంత వేళాకోళంగా ఉం దీ మాట!




రాధాకృష్ణులు వాస్తవంగా ఒకటే స్వరూప మట. కేవల లీలార్థం ఇద్దరుగా కన్పిస్తున్నారట. అవునో, కాదో నా కన్నా తెలిసినవా రెవరు?

విరజా! ... విరజా! ... విరజా ... ఎంత పని చేశావు! నా మనస్సు వికలం చేశావుగదా! నిరపమైన ఈ శరత్ కాలపు తెల్లమబ్బులకు మల్లే నా మనస్సనే ఆకాశంలో శాస్త్ర వాసనలు వ్యాపిస్తున్నాయే! ఈ శరత్పూర్ణిమా పక్ష జన్మల్ని చూడలేను. నాది కృష్ణపక్షం. నాకు కృష్ణదర్శనం కావాలి. మాట లక్కర్లేదు. విరజా! అబ్బ సుధామా! ఎంత క్రూరుడివయ్యా! ఎంత కఠోరమైన శాపంఇచ్చావు!

రాధ కళ్ళలో నీళ్ళు నిండాయి. మనస్సు కాలపు చీకటి గోడలు తడుముతూ, పెంజీకటి కవ్వల నున్న వెలుగు దిక్కుగా ప్రసరిస్తూ అంతర్ముఖం అయింది. గతం కళ్ళముందు చిత్రంలా భాసించింది.

● ● ● ●

అది దివ్యకాంతి మయమైన గోలోకం. భక్తి భావంతో పరవశించే ధన్యులకేగాని ప్రవేశం లేని లోక మది. శ్రీకృష్ణ పరబ్రహ్మ నివాస స్థానం. బ్రహ్మానందప్రదమైన రాసలీలకు జన్మస్థాన మది.

రాసక్రీడ జరుగుతూన్నది. ప్రకృతి, పురుషులు చెట్టాపట్టాలు వేసుకొని చేస్తున్న మండల భ్రమణ నృత్యమది. వేనవేలుగా స్త్రీలు. ఒక్కతి కృష్ణుడు. కాని విచిత్రమేమిటంటే ప్రతి స్త్రీకి ఒక కృష్ణుడు చెంత నున్నాడు. మండల భ్రమణ నృత్యం జరుగు తున్నది. జరుగుతున్నదో, లేదో ఎవ రెరుగుదురు? ఆ క్రీడలో పాల్గొంటున్న అదృష్టవంతులకు కృష్ణ దర్శనాన్ని నిమేషమాత్రం అడ్డగిస్తున్నందుకు వారి కనురెప్పలపైన కోపం వచ్చింది. అనిమిషు లయ్యారు. రెప్పపాటు లేదు. కాలమూ లేదు. కాల పురుషుడిలో మనస్సు లీనం చేసుకున్నారు. వాక్కులూ, కాయాలూ ముందే అర్పించుకున్న వారికి తమ ఉనికి తమకు తెలిసే సాధన మేమున్నది?

అంతలో విరజ వైపు చూశాడు మదనగోపాలుడు. ఆమెలో ఏదో విభ్రాంతి. రాసలో తొట్రుపడు తున్నది. ఒక్కడూ నిల్చాడు పరమాత్మ. ఆయన భుజం ఆధారం చేసుకుని మీదకు వంగింది విరజ! విగతమైన రజోగుణ స్వరూపం! ఈమెకా విభ్రాంతి! నవ్వుకున్నాడు పరమాత్మ.

విరజ మనస్సులో లేస్తున్న ప్రేమ తరంగాలలో ఒక వాసనా తరంగం పొడకట్టింది ప్రభువుకు. ఆమె తన పొందు కోరుతున్నది. అంటే ఇంకా సగుణ భ్రాంతి, అందులోనూ దేహభ్రాంతి పోలేదన్నమాట. ఒక్క విరజేనా? ఇంకా ఎవరైనా ...? ఈ మాటు స్ఫుటంగానే చిరునవ్వు పూసింది పరమాత్మ పెదవుపై.

రాసక్రీడ ఆగిపోయింది. విరజను కటాక్షించాడు ప్రభువు.

అంతవరకూ రాసక్రీడలో సర్వాన్ని మరచి లీన మైన రాధకు ఉన్నట్లుండి శరీర స్పృహ కల్గింది. వెంటనే కళ్ళతో నాలుగు దిక్కులూ వెదికింది. ఏమయ్యారంతా? ఏడీ క్రిష్ణయ్య! ఎక్కడా కన పడతిం?

అన్నిచోట్లా వెదికింది. పూరికే అనటమేగాని గోలోకంలో 'అన్నిచోట్లెక్కడ'? అంతా కాంతి మయమేగా! అందులో దాక్కోవటానికి చీకటికి చోటెక్కడ? కనపడ్డ వాళ్ళందరిని అడిగింది: "ఏడీ కృష్ణుడు?" అని.

కొందరు నవ్వి వూరుకున్నారు. కొందరు మవునం వహించారు. కొందరు దిగులుగా దిక్కులు చూశారు. కొందరు గుడ్ల నీళ్ళుగుడ్ల కుక్కుకున్నారు. కొందరు పెద్దగా ఏడ్చారు. కొందరు అసూయతో కోపంగా చూశారు.

"ఏడీ కృష్ణయ్య?" గద్దించింది రాధ.

వాళ్ళలో ఎవరో గొణిగినట్లుగా చెప్పారు: "విరజను కటాక్షిస్తున్నాడు స్వామి."

రాధ గుండెలో మంట ప్రారంభమైంది. ఏమిటే కృష్ణయ్యా! నా కృష్ణయ్య కౌగిట్లో సుఖించే అధికారం ఎవరిచ్చారు విరజకు? ఏమిటీ అన్యాయం? నాకు నా ప్రభువు అన్యాయం చేస్తాడా?" రాధ మనస్సులో అసూయ చోటు చేసుకున్నది. దానితో మానాభిమానాలు ప్రవేశించాయి. కోపం తలెత్తింది. వాగుపాము బుస కొట్టినట్లు విరుచుకుపడింది.

క్రోధంతో మండిపడుతూ వస్తూన్న రాధను అల్లంత దూరంలోనే చూశాడు సుదాముడు. సుదా ముడికి రహస్యాలు లేవు. న్యాయాన్యాయాలు లేవు. ధర్మాధర్మాలు తెలియవు. అతడికి ద్వంద్వాల్లేవు.



తెలిసిందల్లా ఒక్కటే. అదే తన కృష్ణుడికి ప్రీతికరంగా వ్యవహరించడం. అదే అతని పరమ ధర్మం.

రాధను చూస్తూనే ఏదో ముంచుకు రాబోతున్న దనిపించింది సుదాముడికి. వెంటనే ఒక్క దగ్గుదగ్గి రాబోయే ప్రమాదాన్ని సూచించాడు ప్రభువుకు. నల్లనయ్య మాయమయ్యాడు. మాయాధీశ్వరుడి కిదొక లెక్కా? రాధ రాకను చూసి విరజ నీరు కారి పోయి "నది" అయింది. తీరా వచ్చేటప్పటికి అక్కడ ఎవరూ లేరు. ఏం చెయ్యాలో తోచలేదు రాధకు. ఆమె గిరుక్కున తిరిగి తన మందిరానికి వెళ్ళింది. అక్కడ ఉన్నాడు కృష్ణుడు. పెద్ద రాద్ధాంతం చేసింది. ఉలకలేదు, పలకలేదు కృష్ణుడు.

రాధ వ్యవహారం మొదటినుంచి చూస్తున్న సుధాముడికి కోపం వచ్చింది. 'ఈమె ప్రభువును అదుపాజ్ఞల్లో ఉంచేదా?' అని అతని కోపం. అందుకనే అతనిలోని మార్దవం మాయమై కాఠిన్యం ప్రవేశించింది. 'నీ హద్దుల్లో నువ్వుండటం మంచి'దని కఠినంగా కుండ పగలగొట్టినట్లు చెప్పాడు రాధకు.

అసలే కృష్ణయ్య తనను కాదని వేరొకతెను లాలించాడనే ఉడుకు. ఆ ఇంకొకతె మీద చూపిద్దామనుకున్న కోపం చూపలేకపోయాననే ఆక్రోశం. అందులో అనవసరంగా సుధాముడు అడ్డుపడి అధిక ప్రసంగం చెయ్యడం భరించలేకపోయింది రాధ. కోపం తారస్థాయికి చేరుకున్నది. "నీ రాక్షస ప్రవర్తనకు గాను నువ్వు కృష్ణుడికి దూరంగా భూలోకంలో నూరేళ్ళు రాక్షసుడివిగా జీవించు" అని శాపం ఇచ్చింది రాధ.

సుధాముడు తక్కువ తినలేదు! 'నా అంతవాణ్ణి, గోవిందుడి అప్తమిత్రుడైన వాణ్ణి నన్ను శపిస్తుందా ఈ రాధాదేవి' అని అహంకారపడ్డాడు సుధాముడు. "శాపాలు పెట్టడం నీకే కాదమ్మా— నాక్కూడా వచ్చు" అని మనస్సులో అనుకున్నాడు. వెంటనే ప్రతిశాపంగా "నువ్వు గోపికగా భూలోకంలో పుట్టు. నూరేళ్ళపాటు నీకూ స్వామితో సంబంధం ఉండదు" అన్నాడు. శాపమిచ్చిన రాధను గాని, ప్రతిశాప మిచ్చిన సుధాముణ్ణిగాని మందలించలేదు పరమాత్మ. ఆయన జరుగుతున్నదానికి సాక్షిగానే ఉండిపోయాడు. కానీ, తానై కలగజేసుకోలేదు.

కోపం చల్లారిన మరుక్షణం జరిగిపోయిన మహా నర్థాన్ని తెలుసుకున్నారు రాధా సుధాములు. ఇద్దరూ ఒక్కమారే భోరుమని ప్రభువు పాదాల మీద పడ్డారు. కలతచెందలేదు ప్రభువు. శాంతంగా చెప్పాడు.

"అహంకార మమకారాలనేవి మాయా సృష్టికి బీజాలు. విరజ నన్ను చూసి సొంతం చేసుకోవాలనే వాంఛ పెంచుకుంది. అదే మమకారం. అందువల్లనే ఆమె జడత్వాన్ని పొందింది. రాధకు మమకారమూ, అహంకారమూ రెండూ కలిగినవి. అందువల్లనే ఆమె నా నుంచి దూరమైనది. సుధాముడు తానే కర్తననుకొని అహంకరించాడు. అందుకే అతనికి రాక్షస జన్మ ప్రాప్తించింది.

మరుక్షణం స్వామి కనుపించలేదు రాధా సుధాములకు. సుధాముడు శంఖచూడుడనే రాక్షసుడుగా పుట్టి తులసిని పెళ్ళి చేసుకున్నాడు. రాధ శాపానుభవం కోసం గోకులానికి బయల్దేరింది. అక్కడ చూసింది కళావతీ వృషభానులను. వెంటనే వాళ్ళిద్దర్నీ గుర్తించింది. వాళ్ళిద్దరూ పూర్వం గోలోకవాసులే. కాని వాళ్ళు తనను గుర్తించలేదు. పోనీ వాళ్ళ సంతానంగా వ్యవహరిద్దా మనుకున్నది రాధ.

"అయ్యో! తనకు గర్భ నరకమా! కృష్ణా! నేనేం అపచారం చేశాను!" అని దుఃఖించింది రాధ.

కృష్ణుడిని వదిలి ఉండలేకపోయింది రాధ. జ్ఞానం ఆమెను ఎత్తి పొడుస్తున్నా, భక్తి ఆమెను సగుణం వైపుకే నెట్టింది. అంతా వ్యాపించిన సర్వేశ్వరుణ్ణి కృష్ణాకృతిలో చూడాలని తపించింది. విరహాన్ని భరించలేకపోయింది. గోలోకంలో ఉండలేకపోయింది. బ్రహ్మాదులతో బృందావనానికి దిగి వచ్చింది. అక్కడ చతుర్ముఖుడు రాధాకృష్ణులకు స్వయంగా వివాహం చేయించాడు.

"రాధాదేవి హరి ఒడిలోనూ, ఛాయారాధ రాయణ మందిరంలోనూ ఉన్నారు. గోలోకనాథుడు రాధాదేవితో భారత బృందావనంలో క్రీడించాడు."

అప్పట్నుంచి మొదలైంది తన అవస్థ. సుధాముడి శాపం అమలులోకి వచ్చింది. శ్రీకృష్ణుని వయస్సు అప్పటికి పాతికేళ్ళు. త్రిజగన్మోహనాకృతి.

తన అవతార ప్రయోజనం సాధించడంలో నిమగ్నుడయ్యాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణలలో మునిగిపోయాడు. వాటికి నేడు నూరేళ్ళు. ఈ నూరేళ్ళుగా తాను భారతదేశంలో ఉన్న పుణ్య తీర్థాలలో తీర్థాటనం చేస్తూ ఉన్నది.

• • • •

రాధ కళ్ళలో నిండిన బాష్పాలు టపటపా రాలి యమునా నదిలో పడ్డాయి. కళ్ళకు కమ్మిన నీటి పొర తొలగిపోగానే ఆమెకు ఎదుట ఉన్న దృశ్యం కన్పించింది. అదేమిటి? కాలం నిల్చిపోయిందా? ఇంకా సంధ్యాకాలమేనా? తూర్పున చంద్రుడూ, పడమట సూర్యుడూ ఇంకా అలాగే ఉన్నారా!

కాదు. తాను పొరబడుతున్నది. ఇప్పుడు తూర్పున సూర్యుడూ, పడమట చంద్రుడూ ఉన్నారు. తాను గతపులోతుల్లోకి వెళ్ళినది క్రితం సాయంత్రం.



ఇది ఉదయం. ఇప్పుడు వికసిస్తున్నవి పద్మాలు. ముడుచుకుంటున్నవి కలువలు. తనకు కాలం భాసించలేదు. తన భావంలో లయించింది. మళ్ళా గతం కళ్ళముందు మెదలింది రాధకు.

• • • •

కృష్ణుడు మధురానగరానికి వెళ్ళిపోయిన మరుక్షణం జీవితం శూన్యమనిపించింది రాధకు. ఆయన లేని జీవితానికి అర్థమే లేదు. ఇక సార్థకత ఏమున్నది?

తనలో ఏదో చెప్పలేని వ్యాధి ప్రవేశించి సర్వాంగాలనూ చూర్ణీభూతం చేస్తున్నట్లుగా బాధపడ్డది.

కృష్ణపాద స్పర్శ లేని తన చేతులను తమాల వృక్షాల మొగళ్ళకేసి కొట్టుకొని తనను తనే శిక్షించుకున్నది.

జగన్మోహనమైన కృష్ణాకారం చూడలేని తన కళ్ళకు కన్నీళ్ళ గంతలు కట్టి చీకట్ల కైదులో కూర్చోపెట్టింది.!

తన ప్రాణనాథుడు లేని జీవితం తనకేల? ఈ తనువేల? ప్రాణత్యాగం చేద్దామని నిశ్చయించుకున్నది. సుదాముడి శాపం తల్చుకుని దుఃఖించింది. 'పోనీ, శాపాన్ని తిరస్కరించి స్వామి దర్శనం చేద్దామా! అనే వాంఛ ఆమెలో బయల్దేరింది. మధురా పట్టణానికి బయల్దేరింది. తనకు సుదాముడి శాపాన్ని ధిక్కరించాలని ఉన్నా, ధర్మమూర్తి అయిన స్వామికి పేయతిని ఉల్లంఘించడం ఇష్టం లేదేమో! స్వామి మధురలో లేరు. జరాసంధుడిపైకి యుద్ధానికి భీమార్జునులతో గిరివ్రజం వెళ్ళారని తెలిసింది. తానూ గిరివ్రజానికి వెళ్ళింది. అప్పటికే ఆయన హస్తినకు వెళ్ళారు. తాను హస్తినకు వెళితే, ఆయన ఇంద్రప్రస్థానికి. తాను ఇంద్రప్రస్థానికి ఆయన .... అబ్బ! ఈ దాగుడు మూతలు భరించలేక పోయింది. మళ్ళా బృందావనానికి తిరిగి వచ్చింది. దుఃఖం పట్టలేకపోయింది. తనను స్వామి నిర్లక్ష్యం చేశాడనే అనుమానం కూడా ఆమెకు తోచింది. తాను తిరస్కృత! ఇక తన కీ జన్మ అక్కర్లేదు. తను ప్రాణత్యాగం చేస్తుంది. తీవ్రావేశంలో యమునలో దూకేసింది రాధ.

చతుర్ముఖుడు రెండు చేతులతోనూ ఎత్తుకొని యమున ఒడ్డుకు చేర్చాడు రాధను. ఆయన జ్ఞాన బోధ చేశాడు.

అమ్మా! ఏమిటి ప్రాకృత భావం! సనాతనవు అయిన నీకు ఆత్మహత్య ఏమిటి?

విశ్వమయుడైన విష్ణువు ఒక్క కృష్ణ స్వరూపం లోనే ఉన్నాడా? అంతా వ్యాపించి లేడూ? ఆయన కాని దేమున్నదమ్మా విశ్వంలో? ఈ యమున ఆయన కాదూ! ఈ చెట్లు ఆయన కాదూ? ఈ ప్రకృతి ఆయన కాదూ? నీలోని చైతన్యం ఆయన కాదూ? అసలు నువ్వు ఆయన కాదూ?"

చతుర్ముఖుడికి సమాధానం చెప్పలేకపోయింది రాధ. ఆయన వేదవేత్త. తనకేం తెలుసు? తాను మాట్లాడలేకపోయింది.

రాధ సమాధానపడ్డదనుకుని చతుర్ముఖుడు వెళ్ళిపోయాడు. రాధ మనస్సులో విశ్లేషణ జరుగుతూనే ఉన్నది.

అగ్ని ప్రకృతిలో ఉండే అన్ని చెట్లలోనూ దాగి ఉన్నది. అది సిద్ధాంతం. అయితే చెట్టు దగ్గర కూర్చుంటే చలితీరదు. రెండు కట్టెల్ని ఒరిపిడి పెట్టి నిప్పు చేస్తేనే కావలసిన వేడి లభ్యమవుతుంది. అగ్ని ఉన్నదని తెలిస్తే చలి తీరదు. అగ్నిని ప్రత్యక్షం చేసుకుంటేనే తీరుతుంది.

శాస్త్రం వేరు, అనుభవం వేరు. శాస్త్ర దృష్టిలో భగవంతుడు లేని తావు లేదు. ఆయన వ్యాపన శీలం గల విష్ణువు. అయితే ఆయనను సగుణంగా దర్శించుకోవటంలోనూ ఆనందం ఉన్నది. తనకు అది ఇష్టం. దానిలో దోషం లేదు.

రాధకు జ్ఞాన మార్గం నచ్చలేదు. అది ఆమెకు నీరసంగా, చప్పగా కనిపించింది.

కృష్ణ దర్శనంకోసం తపించింది. "స్వామి శరీర స్పర్శతో పునీతమైన యమునా! నువ్వెంత అదృష్టవంతురాలివి" అంటూ పిచ్చిగా యమునా జలాన్ని ఒళ్ళంతా చల్లుకున్నది.

"కృష్ణపాద స్పర్శ అనుభవించిన ఇసుక రేణువుల్లారా! మీరు ధన్యులు! మిమ్మల్ని నా శిరస్సున ధరిస్తాను" అంటూ నెత్తినిండా ఇసుక పోసుకున్నది రాధ.

పాదపైన విరిసిన గులాబీ పువ్వులను చూచి "నా కృష్ణుడి పెదవులు. నా కృష్ణుడి పెదవులు. నాకు దొరికాయి. నేను వదిలిపెట్టను" అంటూ పొదను గట్టిగా కౌగలించుకొని ముద్దులు పెట్టుకున్నది. ఒళ్ళంతా ముళ్ళు దిగి రక్తసిక్తమైనది. ఆమెకు శరీర బాధే గుర్తురాలేదు.

రాధకు పిచ్చెక్కిం దనుకున్నారు ఆమెను అప్పుడప్పుడు చూస్తూ ఉన్న గోపాలకులు. కాకపోతే ఆమె గుడ్డలేమిటి, ఒళ్ళంతా దుమ్మేమిటి, ఆ ముళ్ళేమిటి? అనుకున్నారు. అయితే ఆ రోజు నుంచి వాళ్ళు ఆమె పోకడలను గమనించడం మొదలెట్టారు. ఎప్పుడు తెలివి తక్కువగా ఏ ఆపదకు గురవుతుందో పాపం! పిచ్చిది అనుకున్నారు వాళ్ళు.

ఆమె నిరంతరమూ తనలో తనే గొణుక్కునేది. ఏం గొణుక్కుంటుందో వినాలనిపించేది వారికి. కానీ సాధారణంగా స్పష్టంగా వినిపించేది కాదు. ఒక రోజు తనలో తనే పెద్దగా గొణుక్కోవడం విన్నాడో చిన్న గొల్లపిల్లవాడు. "అవున్లే. నేనంటే నీకు లెక్కేమిటి? నీకు వేలకొలదీ గోపికలు. అష్టమహిషులు. నాకెవ్వరున్నారు నువ్వు తప్ప! నేనేం అందగత్తెనా, అగర్భ శ్రీమంతురాల్నా! నన్నెందుకాదరిస్తావు నువ్వు!


ఈ శరీరానికి బదులు మంచి గంధపు చెట్టై పుట్టినా బాగుండేది. నీ శరీరా న్నలంకరించేదాన్ని.

నీ పింఛంలో ఒక్క నెమలి కన్నునైనా బాగుండును! నీతో ఉండిపోయేదాన్ని.

ఎందుకొచ్చిన చైతన్యం! జడమైన వెదురు బొంగుగా పుట్టినా బాగుండేది. ఎప్పుడూ నిన్ను వదలకుండా నీ ఒడ్లో ఉండిపోయేదాన్ని.

ఓహో! మురళీ! ఏమిటే నీ అదృష్టం! గోపికలకన్నా, అష్టమహిషులకన్నా నువ్వంటే ఎందుకే నాకృష్ణయ్యకంత ఇష్టం? వాళ్ళనైనా వదిలి ఉండ గలడుగాని, నిన్నుమాత్రం వదిలి ఉండడు కదా? అసలు నాకన్నా నువ్వు ఎందులో గొప్ప! ఆయన శరీరంలోంచిపుట్టిన నేను వేరూ, ఎక్కడో పుట్టిన నువ్వు కావలసిన దానివా? నాలో ప్రాకృతమైన వాయువు సంచరిస్తుంటే, నీలో కృష్ణ ముఖోద్భూతమైన దివ్య వాయువు సంచరించి జగత్తునే చైతన్యవంతం చేస్తున్నదా! నేన్ బ్రతుకంటే నీది బ్రతుకు. నేనూ నీ లాగే బ్రతుకుతాను. ఇక ఈ గాలి నీల్లనే పీల్చను."

రాధ మాటలు మానేసి కొయ్యల్లే బిగుసుకుపోయింది. భయపడిపోయాడు గొల్లపిల్లవాడు. ముక్కు దగ్గర వేలుపెట్టి చూశాడు. గాలి ఆడటం లేదు. వాడికి ఏదో తెలియని సుఖం కలిగింది. అంతలోనే ఆమె చలనం లేని స్థితికి భయమూ కలిగింది. పరుగెత్తి గోకులంలో పెద్దలకు చెప్పాడు. "ఆడవిలో పిచ్చిది చచ్చిపోయిం"దని. వాళ్ళు ఉరుకు పరుగులమీద వచ్చారు. రాధ శరీరాన్ని పరీక్షించారు. ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లేవని తేల్చారు. ఉలుకూపలుకూ లేదు. "ఇక మనం చేసేదేం లేదు పదండ్రా. ఇప్పటికే చీకటి పడింది. రేపు కట్టెలు తెచ్చి తగలేద్దాం!"



అని వెళ్ళిపోయారు. కాని వాళ్ళలో ఎవ్వరికి ఏడుపు రాలేదు. రాధను తాకిచూచిన వాళ్ళకేదో అనిర్వచనీయమూ, అపూర్వమూ అయిన శాంతి, నిశ్చలత!

రాధ తనకు తెలియకుండానే భావ సమాధిని పొందింది. సమాధినిపొందటమూ, కేవల కుంభక స్థితి అనుభవించడమూ అనే రెండు స్థితులు లేవు. ఎప్పుడు ఇంద్రియాలు మనస్సులోనూ, మనస్సు బుద్ధిలోనూ, బుద్ధి ఆత్మలోనూ లీనమైందో అప్పుడామెకు బాహ్య ప్రజ్ఞ నశించింది. తీవ్రధ్యానంలో ఆమెకు కుంభక స్థితి అప్రయత్నంగా సిద్ధించింది. ఆ అనిర్వచనీయమైన బ్రహ్మానందానుభూతిని ఆమె ఎంతసేపు అనుభవించిందో ఆమెకే తెలియదు. ఇంతలో ఆమెకు వీణానిక్వాణం వినిపించింది. ఈ వీణావేణు మృదంగాది సర్వనాదాలు, రంగురంగుల కాంతులీనే చిత్ర విచిత్రమైన కళలో ఆమెకు విరహం భరించలేక కృష్ణధ్యానం మొదలు పెట్టిన మొదటి రోజుల్లోనే అనుభూతమైనవి. ఇప్పుడు మళ్ళా ఆ నాదం వినిపించేటప్పటికి ఆమెకు భయం కలిగింది. తన సాధన మళ్ళా మొదటికి వస్తున్నదా అన్న ఆలోచన వచ్చింది. ఆలోచన రాగానే బుద్ధి పనిచేసింది. వెంటనే మనస్సు జాగృతమైంది. తక్షణం ఇంద్రియాలు మేల్కొన్నాయి. సమాధి వికలం అయింది. 'అబ్బ! ఒళ్ళంతా నెప్పులుగా ఉన్నది' అనుకొన్నది. కళ్ళు తెరిచింది.

తన ఎదుట ఒక దివ్యమైన వెలుగు. హిరణ్యగర్భంగా ధవమైన వెలుగు. ఒక జ్యోతిర్మండలం. జటాకలాపం.

ఎవరు? ఎవరు?

చెవులు వింటున్నాయి. వీణానిక్వాణం. దానితో 'ఓం నమో నారాయణాయ ఓం నమో నారాయణాయ. అష్టాక్షరమంత్రం. తెలిసింది. దేవర్షి.

ఏమంటున్నదో తెలియకుండానే ఉచ్చరించింది. నారదుడి పాదాలు కన్నీళ్ళతో కడిగింది రాధ. ఆయన ఆమె తల నిమిరి ప్రేమగా లేవదీశాడు.

''కృష్ణుడికీ, మురళికీ ఎందుకంత అవినాభావమో తెలిసిందా రాధాదేవీ? మురళి కృష్ణ తత్వానికి సంకేతం. మానవులకు మల్లేనే దానికి నవరంధ్రాలున్నాయి. గొట్టం అనబడే శరీరం ఉన్నది. కాని దానికీ, మానవులకూ ఒక తేడా ఉన్నది. ఆ వేణువులో ఏమున్నది? శూన్యం. నాది అనేది ఏది ఉంచుకోదది.

గోపికలకు కృష్ణుడంటే ప్రేమ. ఆయనను వారు వదలలేరు. ఆయన అధరామృతం తమకే సొంతం కావాలన్న తపన ఉన్నది వాళ్ళకి.

మురళి అలా కాదు. దానికి ఏదీ అక్కరలేదు. అన్నీ అందరికీ పంచి ఇవ్వటమే దాని లక్షణం. ఆ జగన్నాథుడి మధురాధరాలతో నుంచి వచ్చిన మధుర మంద్రగానాన్ని కూడా తనలో ఉంచుకోవాలనుకోదు వేణువు. స్వార్థం లేదక్కడ. త్యాగానికి పరాకాష్ఠ మాత్రమే ఉన్నది. అదే కృష్ణుడికి నచ్చేది. అందువల్లే అది నీకంటే, గోపికలకంటే కూడా ప్రియతమమై కృష్ణుడి పేరుకు ముందుచేరి ఆయనను వంశీమోహనుణ్ణి చేసింది. ఆయనకు అత్యంత ప్రియతమమై ఆయన బొడ్డులోనే కాపురం పెట్టింది. కృష్ణుడు నిన్ను విడువకుండా ఉండాలంటే నువ్వూ అలా కావాలి. ''త్యాగానికే అమృతత్వసిద్ధి.

నారద వాక్యం ముగిసిందో లేదో రాధలో జ్ఞానోదయమైంది. మీట నొక్కటానికి, దీపం వెలగటానికి ఎంత సమయం కావాలి? రెండూ ఏక కాలంలోనే జరుగుతాయి. రాధ పరిపక్వమైన సాధన కుంది. కేవలం సద్గురువు లభించని లోపం మాత్రం మిగిలి ఉన్నది. ఆ సద్గురు కృప లభించింది.

యమునా నీళ్ళలో శ్రీకృష్ణుణ్ణి చూడటంతప్పు. అప్పుడు యమున వేరూ, శ్రీకృష్ణుడువేరూ. చూచే నేను వేరూ. అందులో త్రిపుటి ఉన్నది.

తనలో కృష్ణుడిని చూడటం కాదు. తానే కృష్ణుడు. ఉన్నది కృష్ణతి. ఇంకేమీ లేదు.''

ఆశ్చర్యంగా తనను తాను చూసుకున్నది రాధ. తాను కృష్ణుడే. రాధాకృష్ణుడు. తనకు వియోగం లేదు. విరహం లేదు. అది అజ్ఞాన జన్య దోషమే. తాను ఆనంద స్వరూపిణి. హ్లాదినీశక్తి. అఖండ సచ్చిదానంద రస స్వరూపిణి.

వీణాశ్రుతిలో మేళవించిన కంఠంతో తనలో లీనమవుతున్న దేవవాణి ఆమె హృదయానంద సముద్రంలో ఒక తరంగంగా లయించి పోయింది. ఆ క్షణం నుంచి భక్తిసంప్రదాయానికి ఆమే జగద్గురువు— రాధ. ✽